www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 సెప్టెంబరు 2025
5
ఏలూరు

13 రోజుల పాటు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సత్రంపాడులో అక్టోబరు మూడో తేదీ నుంచి 13 రోజుల పాటు సిసి టివి, కెమెరా రిపేరింగ్ (పురుషులకు, మహిళలకు), జ్యూట్ బ్యాగ్స్ 13 రోజులు (మహిళలకు) ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సువారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుంచి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్ర లోనుకు సిఫార్స్ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాల కోసం 9948565256, 9502723561 సంప్రదించాలని తెలిపారు.

ధాన్యానికి వేళాయే.. జెసి లేరాయే..!

- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు
- ఆ శాఖను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీ
- ధాన్యం కొనుగోలులో కీలక పాత్ర జెసిలదే
- జెసి నియామకంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టి సారించేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సమయం ఆసన్నమైంది. అక్టోబర్ రెండో వారం నుంచే ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 10.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభు త్వం టార్గెట్‌గా నిర్ణయించింది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థి తి కన్పిస్తోంది. అందుకు ప్రధాన కారణం పౌర సరఫరాల శాఖను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండి పోవడమే. ధాన్యం కొనుగోలులో జెసిలదే కీలకపాత్ర. పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖాధికారులతో నిరంతరం పర్య వేక్షణ చేస్తూ.. సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత జెసిలపైనే ఉంటుంది. ముఖ్యంగా పెద్దఎత్తున ధాన్యం దిగుబడి వచ్చే ఏలూ రు జిల్లాలో జాయింట్ కలెక్టర్ పాత్ర మరింత కీలకంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన ఖరీఫ్, రబీల్లో ధాన్యం కొనుగోలులో జెసి ధాత్రిరెడ్డి కీలకపాత్ర పోషించారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే పరిష్కరించేవారు. సంచులు, వాహనాలు, తూకం వంటి ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే చర్యలు తీసుకుని రైతులకు ఊరట కల్గించేవారు. దీంతో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేది. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇటీవల జరిగిన ఐఎఎస్‌ల బదిలీల్లో భాగంగా జెసిగా ఉన్న ధాత్రిరెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒగా నియమించింది. జెసి బదిలీ జరిగి రెండు వారాలు దాటిపోయింది. ఇప్పటి వరకూ జెసి స్థానంలో మరో ఐఎఎస్ అధికా రిని ప్రభుత్వం నియమించలేదు. దీంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని జెసి బాధ్యతలను సైతం చూస్తున్నారు. జిల్లా కలెక్టర్ నిరంతరం అన్ని శాఖలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. పౌర సరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించడం అసాధ్యమనే చెప్పాలి. పౌరసరఫరాల శాఖాధికారులు సైతం నిరంతరం బిజీగా ఉండే కలెక్టర్‌ను కలిసి సమస్యలను నివేదించడం సాధ్యం కాకపోవచ్చు.

జెసి లేకపోతే ఇక్కట్లే

జెసి నియామకం జరగకపోతే ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మొత్తంగా 5.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 261 ఆర్ఎస్‌కెలు, 130 సహకార సంఘాల ఆధ్వర్యంలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇంత పెద్దమొత్తంలో ధాన్యం కొనుగోలు జరగాలంటే పౌర సరఫరాల శాఖను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ ఉండటం అత్యంత అవసరం. ఏదైనా సమస్య ఎదురైతే రాష్ట్రస్థాయి అధికారు లతో మాట్లాడి పరిష్కరించాలంటే జెసి స్థాయి అధికారి కచ్చితంగా ఉండాలి. ఎందుకంటే ధాన్యం కొనుగోలులో వచ్చే సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం పరిష్కరించాల్సి ఉం టుంది. ఏమాత్రం ఆలస్యమైనా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గడిచిన రబీలో ధా న్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం టార్గెట్ తక్కువ ఇచ్చింది. దీంతో రైతులు ధాన్యం అమ్ముకు నేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో జెసి కలెక్టర్‌తోనూ, మం త్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడి టార్గెట్‌ను పెంచేం దుకు కృషి చేసి సమస్యను పరిష్కరించారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగడంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, ఎంఎల్ఎలు సైతం జెసిని అభినందించిన పరిస్థితి ఉంది. జెసి పోస్టు ఖాళీగా ఉండటంతో ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు పరిస్థితి ఎలా ఉంటు oదోననే చర్చ సర్వత్రా నడుస్తోంది.

పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సమస్యపై దృష్టి సారించేనా?

ధాన్యం కొనుగోలులో పౌరసరఫరాల శాఖదే కీలక పాత్ర. ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సైతం ఉన్నారు. ఆ శాఖను పర్యవేక్షించే జెసి పోస్టు ఖాళీగా ఉండటంపై ఆయన దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బంది పెడితే పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న ఆయనకే చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది. జెసి లేకపోవడంతో వివిధ శాఖలకు సంబంధించిన అనేక ఫైల్స్ పెండింగ్‌లో ఉండిపోయినట్లు తెలుస్తోంది. ఇన్‌ఛార్జి మంత్రి జోక్యం చేసుకుని వెంటనే జెసి నియామకం చేపట్టి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంతా కోరుతున్నారు.

ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ వెట్రిసెల్వి

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, జిల్లా అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం సేకరణపై జిల్లాలోని రైతులందరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఖరీఫ్‌లో ధాన్యం సేకరణపై జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యలపై వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో రైతుల నుండి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల నుండి సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రైతులకు గోనె సంచుల పంపిణీ, ధాన్యం తేమశాతం లెక్కింపు, రైతులకు కూపన్ల జారీ, ధాన్యం రవాణా, రైతు ఖాతాకు సొమ్ము జమ చేయడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేలా పోస్టర్లు ముద్రించారన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కార మార్గాలను తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఎస్ఒ విలియమ్స్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మూర్తి, జిల్లా సహకార శాఖాధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, ఎస్‌డిసి దేవకీదేవి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

1న కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు, కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు

'స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్' కింద ఏలూరు కలెక్టరేట్లో అక్టోబర్ 1న మహిళా ఉద్యోగులు, వారి కుటుంబంలోని మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. 'స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్' కింద వైద్య శిబిరాల నిర్వహణపై వైద్య ఆరోగ్య శాఖాధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యకర సమాజం రూపొందు తుందన్నారు. వైద్య పరీక్షల్లోనే దీర్ఘకాలిక రోగాలు బయటపడతాయని, అప్పటికే వ్యాధి తీవ్రత పెరిగి ప్రాణాంతకం అవుతుందని అన్నారు. ప్రతి ఆరు నెలలు లేదా సంవత్సరానికి ఒక్కసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ వెయిటింగ్ హాలులో ఈ నెల 1వ తేదీ ఉదయం 10 గంటలనుండి వైద్య శిబిరం ఏర్పాటుచేసి మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, వారితో పాటు వారి కుటుంబంలోని మహిళలు, పురుష ఉద్యోగుల కుటుంబాల్లోని మహిళలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతంను కలెక్టర్ ఆదేశించారు. బిపి, డయాబిటిస్, రక్తహీనత వంటి పరీక్షలతోపాటు సర్వైకల్ కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని డిఎంహెచ్ఒను ఆమె ఆదేశించారు.

పోరుబాట ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఫ్యాప్టో ఆధ్వర్యాన 7న పోరుబాట ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఫ్యాప్టో అక్టోబర్ 7న విజయవాడలో నిర్వహించే ఫ్యాప్టో పోరుబాట ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ పిలుపునిచ్చారు. సోమవారం పోరుబాట పోస్టర్‌ను స్థానిక పవర్‌పేటలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఫ్యాప్టో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్, ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 16 నెలల క్రితం కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరడం లేదన్నారు. పండుగ రోజుల్లో కూడా ప్రభుత్వాల నుంచి ఎటువంటి ప్రయోజనాలు ఉద్యోగులకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల్లో కదలిక రావాలంటే ఉద్యమమే శరణ్యమన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో 72, 73, 74 జిఒలు అమలు చేయాలని, పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలనీ, కేంద్ర మెమో నెం.57ను అమలు పరుస్తూ 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 7న విజయవాడలో జరిగే పోరుబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కో ఛైర్మన్ జి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రవికుమార్, బి రెడ్డిదొర తదితరులు పాల్గొన్నారు.

గోదారమ్మ దోబూచులాట

తగ్గినట్టే తగ్గి పెరుగుతున్న గోదావరి వరద

భద్రాచలంలో కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఐదు రోజులుగా గోదావరికి వరద ఉధృతి తగ్గుతూ, పెరుగుతూ, నిలకడగా ఉంటూ దోబూచులాడుతోంది. ఆదివారం ఉదయం భద్రాచలంలో 42.2 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం సోమవారం నాటికి స్వల్పంగా పెరిగి 44.6 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద అంటేనే మండలంలోని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వేలేరుపాడు నుంచి రుద్రంకోట, రేపాకగొమ్ము రహదారులు నీట మునగడంతో బోట్లపై

వేలేరుపాడు: పడవపై రాకపోకలు

రాకపోకలు సాగిస్తున్నారు. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో కన్నాయిగుట్ట వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో కొత్తూరు, నాళవరం, బోళ్లపల్లి, చిగురుమామిడి, ఎడవల్లి, కోయిదా, కట్కూరు తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పోలవరం నుంచి 9,69,595 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి నెమ్మదిగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,69,595 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.530 మీటర్లు, సిల్‌వే దిగువన 23.880 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 11.87 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

పిహెచ్‌సిల్లో ఒపి నిలిపివేత

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన తీవ్రతరం చేస్తామని వైద్యుల హెచ్చరిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పరిధిలోని వట్లూరు, చాటపర్రు పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న వైద్యులు సోమవారం ఒపి సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. పిహెచ్‌సి వైద్యుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందించే వైద్యుల సమస్యలను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి ఆందోళన కొనసాగిస్తూ ఆన్‌లైన్ రిపోర్టింగ్, 104 సేవలు నిలుపుదల చేశామని, జిల్లా అధికారుల గ్రూపుల నుంచి బయటకు వచ్చేశామని తెలిపారు. సోమవారం ఎమర్జెన్సీ సేవలు మినహా ఒపి వైద్య సేవలను నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పటికీ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే ఏలూరు, విజయవాడలో తీవ్ర ఆందోళనకు దిగుతామని చెప్పారు. పీజీ సీట్లలో పిహెచ్‌సి వైద్యులకు గతంలో 30 శాతం సీట్లు కేటాయించేవారని, గతేడాది 85 జిఒ తెచ్చి పిజి సెట్లను ప్రభుత్వం 15 శాతానికి పరిమితం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చర్చలు జరిపినా 20 శాతం సీట్లు మాత్రమే కేటాయిస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు. అదేవిధంగా పిహెచ్‌సి వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకూ నెరవేర్చలేదన్నారు. ఈ ఏడాది పీజీ సీట్లను మళ్లీ 15 శాతం తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, గ్రామాల్లో సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం అన్యాయం చేసిందని వాపోయారు. పిహెచ్‌సి వైద్యులుగా చేరిన తమకు ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగ విరమణ వరకు అదేవిధంగా ఉండిపోతున్నామని, టైం బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని కోరారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమం కింద వైద్యులకు రూ.ఐదు వేల అలవెన్స్, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారంతో పాటు కచ్చితమైన పనిగంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు, జాబ్ చార్ట్, అనుకూలమైన పని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనధికార వ్యక్తులు పిహెచ్‌సిల్లో ఇన్‌స్పెక్షన్ చేయకుండా నిబంధన విధించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని అన్నారు.

కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం సాధారణ ఒపిలు నిలిపివేశారు. ఎమర్జెన్సీ కేసులుకు మాత్రమే వైద్యం అందించారు. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య శాలల్లో సాధారణ ఒపిలు నిలిపివేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య శాలల్లో ఒక్కరోజు వైద్య సేవల్లో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సమ్మె దీర్ఘకాలికంగా కొనసాగితే వైద్య సేవలు అందవని పేద ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాటపర్రు పిహెచ్‌సి

జిఒ 85ను రద్దు చేయాలి

ప్రదీప్ చంద్ర, చాటపర్రు పిహెచ్‌సి వైద్యులు



మా న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. గత సంవత్సరం ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 85ను రద్దు చేయాలి. కచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవులను కల్పించాలి. పిహెచ్‌సి వైద్యులుగా చేరిన వారికి ప్రమోషన్లు కల్పించాలి.

ఏలూరు, విజయవాడలో ఆందోళన

సత్యనారాయణ, వట్లూరు పిహెచ్‌సి వైద్యులు

గ్రామాల్లో, గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందిస్తున్న మా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరంగా ఉంది. ఈరోజు ఒపి సేవలను బహిష్కరించాం. ప్రభుత్వం స్పందించకపోతే ఏలూరు, విజయవాడలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

డిసెంబర్ 12, 13 తేదీల్లో

ఆరో హేలాపురి బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న వక్త

డిసెంబర్ 12, 13 తేదీల్లో ఆరో హేలాపురి బాలోత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహణకు అంతా కలిసి రావాలని రిటైర్డ్ ఎంఇఒ మారుబోయిన కోటేశ్వరరావు కోరారు. జిల్లా కార్యాలయంలో హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాలు ఆరో ఆహ్వాన సంఘ ఏర్పాటు సమావేశానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు స్వాగతం పలికారు. సమావేశానికి ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ రంగాలు, సంస్థలు, సంఘాలకు చెందిన 50 మంది పాల్గొన్నారు. మారుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవం అందరి మన్ననలను చూరగొందన్నారు. సిద్ధార్థ క్రెస్ట్ స్కూలు యాజమాన్యం ఆరో బాలోత్సవం నిర్వహణకు సిద్ధమైందన్నారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒకటో తరగతి, ఆలోపు పిల్లలకు చిత్రలేఖనం పోటీలకు సంబంధించి నవంబర్ 9న గ్జేవిఆర్ నగర్‌లో ఉన్న వాయిస్ కాన్వెంట్‌లో ప్రతిభా ప్రదర్శనలకు అవకాశం ఇస్తున్నామని తెలిపారు. 55 అంశాలతో కూడిన పిల్లల సంబరాలు డిసెంబర్ 12, 13 తేదీల్లో వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో నిర్వహిస్తారని, డిసెంబర్ 14న సిఆర్‌రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో బహుమతి ప్రదానం జరుగుతుందని ప్రకటించారు. హేలాపురి బాలోత్సవం సహకారంతో ఈ సంవత్సరం కైకలూరు, భీమడోలులో కూడా బాలోత్సవాల నిర్వహణకు అక్కడున్న పిల్లల ప్రేమికులు ముందుకొచ్చారని తెలిపారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ లౌకిక రాజ్యాంగం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత, చదువు విలువలు అనే మూడు అంశాలు ప్రాతిపదికగా పిల్లల సంబరాల అకడమిక్, కల్చరల్ అంశాలు డిజైన్ చేయబడ్డాయని అన్నారు. ప్రభుత్వ స్కూల్స్‌కు, ప్రైవేటు స్కూల్స్‌కు విజేతల ఎంపికలో సముచిత స్థానం ఉంటుందన్నారు. టీచర్స్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, నెక్సిజన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, వసుధా ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజు గౌరవాధ్యక్షులుగా, అడుసుమిల్లి నిర్మల ఛైర్‌పర్సన్‌గా, అధ్యక్షులుగా ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కార్యదర్శిగా గుడిపాటి నరసింహారావు, పదిమంది వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఐదుగురు గౌరవ కార్యదర్శులు, 15 మంది గౌరవ సలహాదార్లు, అకడమిక్ కోఆర్డినేటర్లుగా నలుగురు, కల్చరల్ కోఆర్డినేటర్లుగా నలుగురు, వందమంది నిర్వాహక కమిటీ ప్రతిపాదించారు. 140 మంది సభ్యులతో ఆహ్వానసంఘం ఏర్పాటైంది. అకడమిక్ టీమ్ తరపున కోఆర్డినేటర్ షేక్ ముస్తఫాఆలి, కల్చరల్ అంశాల తరపున దువ్వి హేమ సుందర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజిఎంవిఆర్.కృష్ణారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, కెవి నారాయణరావు, ఎస్ఎన్.కట్టా, పి.భాస్కరరావు, జి.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులపై

సిపిఎస్ ఉద్యమ కేసు కొట్టివేత

రుజువు కాని నేరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేరం రుజువు కాకపోవడంతో ఏడుగురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులపై ఉన్న సిపిఎస్ ఉద్యమ కేసు కొట్టివేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యమంలో పాల్గొన్న కారణంగా గత ప్రభుత్వం 2022 ఆగస్టు 24వ తేదీన జెఎసి నాయకులైన ఆర్ఎస్.హరనాథ్, చోడగిరి శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు షేక్ ముస్తఫ్ ఆలీ, పిఆర్‌టియు నాయకులు పువ్వుల ఆంజనేయులు, ఎపిటిఎఫ్-1938 నాయకులు గుగ్గులోతు కృష్ణ, డిటిఎఫ్ నాయకులు ఎం.ఆదినారాయణ, ఎపి కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కె.నాగేశ్వరరావులపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు వల్ల గత మూడేళ్లుగా వీరంతా వాయిదాలకు జిల్లా కోర్టు చుట్టూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రతినెల తిరిగారు. కేసు పెట్టిన వారిని, సాక్షులను, నాయకులను విచారించిన అనంతరం నేరం ఋజువు కాకపోవడంతో సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని స్పెషల్ మొబైల్ కోర్టు, మూడో అదనపు సివిల్ జడ్జి వారి న్యాయస్థానంలో న్యాయమూర్తి కేసు కొట్టివేస్తున్నట్లు తీర్పును వెలువరించారు. ఈ సుదీర్ఘ న్యాయ పోరాటంలో సహాయం చేసి కేసు వాదించిన లాయర్లు మాగంటి లక్ష్మణ్‌కుమార్, జి.సోమయాజి, సత్యనారాయణ, మౌళి, రామకృష్ణలకు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమ కేసులతో ఉద్యమాలను అణిచివేయటం సాధ్యం కాదని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉంటారని, అరెస్టులు, కేసుల పేరుతో ఉద్యోగ సంఘాల నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేయకుండా ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం

ఆర్‌డిఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు, ఎంపిడిఒకు ఎంపిటిసి సభ్యుల వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



వినతి అందిస్తున్న ఎంపిటిసి సభ్యులు

మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిపై అవిశ్వాసం ప్రకటిస్తూ పలువురు ఎంపిటిసి సభ్యులు సోమవారం ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్‌కు, ఆర్‌డిఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపితో పాటు మరో ఐదుగురు ఎంపిటిసిలు అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసి ఆర్‌డిఒ కార్యాలయంతో పాటు ఎంపిడిఒకు అందించినట్లు చెప్పారు. వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్, తాటియాకులగూడెం ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్ మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలంలో మొత్తం తొమ్మిది ఎంపిటిసి స్థానాలు ఉన్నాయని చెప్పారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఏడు స్థానాల్లో వైసిపికి చెందిన అభ్యర్థులు, రెండు స్థానాల్లో టిడిపికి చెందిన అభ్యర్థులు గెలుపొందారన్నారు. అయితే అప్పట్లో ఎంపిపి పదవి సున్నం సురేష్ ఆశించారని, కాని స్థానిక ఎంఎల్ఎ ఎంపిక మేరకు కోర్స పోసమ్మకు పదవి దక్కిందని చెప్పారు. అయితే నాలుగేళ్లు పూర్తయినా ఆమె పదవి నుంచి దిగకపోవడంతో ఎంపిపిని పదవి నుంచి దించేయాలంటే మొత్తం సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది నోటీసుపై సంతకాలు చేయాల్సి ఉండగా మొత్తం తొమ్మిది మంది ఎంపిటిసి సభ్యులకు ఆరుగురు సోమగాని శ్రీనివాస్, సున్నం సురేష్, ఉప్పల లలిత కుమారి, పి.నాగమణి, కె.సుధారాణి, ఎం.వెంకటలక్ష్మి ఆరుగురు అభ్యర్థులు అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసి ఆర్‌డిఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు, స్థానిక ఎంపిడిఒకి వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ సెలవు రోజుల్లో చేస్తున్న అదనపు పని నుంచి మినహాయింపు ఇవ్వాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు.

ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోండి

సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ శ్రీదేవి

ప్రజాశక్తి - చింతలపూడి

ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్ ఎస్.శ్రీదేవి సోమవారం చింతలపూడి సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు అనారోగ్యంగా ఉన్న వారి గురించి ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, జైల్ సూపరింటెండెంట్ కృపానందం, బార్ అసోసియేషన్ సభ్యులు, పిఎల్‌వి కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

రహదారి సౌకర్యం లేకపోవడంతో

గోదావరిలో తెప్పపై ఆసుపత్రికి తరలింపు

ఆలస్యం కావడంతో మృతి చెందిన వైనం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన కాకాని వెంకటేశ్వర్లు (41) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటివరకు పనిచేసిన వ్యక్తికి ఒక్కసారిగా గుండెల్లో నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు చుట్టూ గోదావరి ముంచెత్తి ఉండడంతో రహదారి సౌకర్యం లేక గోదావరిలో తెప్పపై తీసుకెళ్లి అక్కడి నుంచి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రహదారి సౌకర్యం ఉండి ఉంటే మా ఆయన బ్రతికి ఉండేవాడేమోనని, మా కుటుంబానికి దిక్కు ఎవరని మృతుని భార్య పుష్పలత వాపోయింది. మగదిక్కు లేకుండా ఇద్దరు ఆడపిల్లలతో నేను ఎలా బ్రతకాలని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇద్దరు ఆడపిల్లలతో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకోవాలని కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటున్నారు.

వారిది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. భార్యాభర్తలిద్దరూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతుని కుమార్తెలు మధుశాలిని తొమ్మిదో తరగతి, ప్రణతి ఆరో తరగతి చదువుతున్నారు. వారికి ఆర్అండ్ఆర్ పరిహారం అందినా కాని పునరావాస కాలనీల్లో ఇల్లు పూర్తవ్వక వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ తిర్లాపురం గ్రామంలోనే జీవనం సాగిస్తున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అండర్-14 బాలికల రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలోని వెయిట్ హాలులో వెస్ట్ గోదావరి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య ప్రారంభించి మాట్లాడారు. పోటీల్లో వివిధ జిల్లాల నుంచి సుమారు 60 మంది బాలికలు పాల్గొనగా ఎనిమిది విభాగాల్లో పోటీలు జరిగాయి. బెస్ట్ లిఫ్టర్‌గా కడప జిల్లాకు చెందిన జి.లెనిన్‌ప్రియ ఎంపికవ్వగా, టీమ్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా వెస్ట్ గోదావరి, రన్నర్‌గా గుంటూరు జిల్లాలు ఎంపికయ్యాయి. గెలుపొందిన విజేతలకు మెడల్స్ అందించారు.

ఏజెన్సీలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

ఎంఎల్ఎ బాలరాజుకు ఫ్రాన్సిస్ వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలోని బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా మండల హెడ్ క్వార్టర్లలో, హాస్పటల్‌లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద అన్నాక్యాంటీన్లు ఏర్పాటు చేయాలని రెడ్డి గణపవరం మాజీ ఎంపిటిసి సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్ కోరారు. ఈ మేరకు బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఏజెన్సీ మండలాల్లో అన్నా క్యాంటిన్ పెడతామని 2024 ఆగస్టు తొమ్మిదో తేదీన చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ మండలాల్లో హాస్పటల్స్‌కు, తహశీల్దార్, ఎంపిడిఒ, తదితర మండల కార్యాలయాలకు ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారన్నారు. ఆ పేద ప్రజలు, గిరిజనులు భోజనం చేయాలంటే రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చవుతుందన్నారు. గిరిజన పేదల ఆకలి తీర్చాలంటే చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ బాలరాజు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్నాక్యాంటీన్లు ఏర్పాటు కోసం కృషి చేస్తానని చెప్పారు. అలాగే దోమతెరలు ఇచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

టి.నరసాపురం సొసైటీ చైర్మన్ సోంబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సంఘ సభ్యుల సహకారంతో సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని టి.నరసాపురం సొసైటీ చైర్‌పర్సన్ జోనుబోయిన సోంబాబు అన్నారు. స్థానిక సంఘ సహకార రైతు రత్న ప్రాంగణంలో సోమవారం చైర్‌పర్సన్ సోంబాబు అధ్యక్షతన సొసైటీ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట రుణాల మంజూరుకు గడువు ముగిసిన డిపాజిట్లు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరూ సహకరించాలన్నారు. సంఘ అభివృద్ధికి సభ్యులు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్లు మోదుగు రామారావు, ఉయ్యూరి నాగమణి, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.ఆగష్టీన్, రైతులు అద్దంకి జగ్గారావు, చక్రపాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోంబాబు

రైతుల సంక్షేమానికి కృషి

మక్కినవారిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ సూర్యనారాయణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని మక్కినవారిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట సూర్యనారాయణ తెలిపారు. స్థానిక సొసైటీ ఆవరణలో మహాజన సభ సోమవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు రైతుల సౌకర్యార్థం పొగాకు బేళ్లు నిల్వ చేసుకోవడానికి గోడౌన్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి ఒక్కొక్క బేరన్‌కు రూ.పది లక్షల రుణం ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. బేరన్‌కు వంద కేజీల పురుకొస అందించనున్నట్లు తెలిపారు. సొసైటీ ద్వారా రైతులకు అన్ని రకాల పురుగు మందులు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సిఇఒ యువివి.సత్యనారాయణ సంఘ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెతుకుమిల్లి గోపాలరావు, సొసైటీ పర్సన్లు నరదల సత్యనారాయణ, దాసరి వెంకటలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్యనారాయణ

నేరాలు - ఘోరాలు

భవాని మాలధారులను ఢీ కొన్న బైక్

బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ మృతి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

భవాని దీక్షాదారులను ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందగా, పలువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన జాతీయ రహదారి చేబ్రోలు - కైకరం మార్గమధ్యలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కైకరానికి చెందిన సూరాబత్తుల వెంకటరమణ, మరో మహిళ ఓ హోటల్లో సహాయకులుగా పని చేస్తుంటారు. రోజూలానే వెళ్లి తిరిగి వస్తుండగా చేబ్రోలులో కైకరం వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని వెంకటరమణ(43)తో పాటు మరో మహిళ ఎక్కారు. ఆంజనేయస్వామి గుడి- సోమా కంపెనీ మధ్యలో రోడ్డుపై నడుకుంటూ వెళ్తున్న భవాని మాలధారులను బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వెంకటరమణ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న అడపా రాజు, మరో మహిళ, భవానీ భక్తులు పలువురు గాయపడగా వారిని అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలు కైకరంలో కాలువ గట్టున చిన్న పాకలో ఉంటున్నారు. ఆమె భర్త శ్రీను లెప్రసీ బాధితుడు, కుమారుడు రాజు పోలియో బాధితుడు. కుటుంబంలో అందరూ అనారోగ్యంతోనే ఉన్నారు. వెంకట రమణ కష్టంతోనే కుటుంబం గడపాల్సి ఉంటోంది. ఆమె మృతితో తీవ్ర విషాదం నెలకొంది. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సుంకాల సుడిలో ఆక్వా విలవిల

లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

ప్రకటనలకే పరిమితమైన పాలకులు

రొయ్యల పట్టుబడి

ప్రజాశక్తి - కాళ్ల

డాలర్ పంటగా పేరొందిన ఆక్వా సాగు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కుదేలవుతోంది. ఏటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకూ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా సుంకాల దాడితో ఆక్వా రంగం విలవిల్లాడుతోంది.

విదేశాలకు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో రొయ్యలు 1.10 లక్షల ఎకరాల్లోనూ, చేపలు 1.80 లక్షల ఎకరాల్లోనూ సాగవుతున్నాయి.

ఉప్పుటేరు, కొల్లేరు ప్రాంతాల్లో ప్రధానంగా వనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. రూ.18 వేల కోట్లు వార్షిక టర్నోవర్ సాగుతోంది. ఇంత విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా ఆ రంగం సంక్షోభంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వనరుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక ఏడేళ్ల నుంచి ఆక్వా రైతులు నష్టాల బాటలో పయనిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ ఛార్జీల భారం గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది. ఆందోళనల ఫలితంగా రొయ్యల మేత, ముడి సరుకు ధరలు తగ్గినా మేత ధరలు తగ్గడం లేదు. ఈ క్రమంలోనే అమెరికా టారిఫ్ దాడి ఆక్వా రంగాన్ని అతలాకుతలం చేస్తోంది.

తక్కువ ధరకు రొయ్యల కొనుగోలు

అమెరికా సుంకాల భారం చూపి స్థానిక వ్యాపారులు, దళారులు రొయ్యల రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సగానికి సగం ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

ప్రస్తుతం ధరలు

25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.680 పలికేది. ట్రంప్ నోట టారిఫ్ మాట వచ్చిందో, లేదో వ్యాపారులు సిండికేటయ్యి ధరలు అమాంతం తగ్గించేశారు. ప్రస్తుతం 25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.460, 30 కౌంట్ ధర కేజీ రూ.395, వనామీ రకం 30 నుంచి 40 కౌంట్ రూ.370, 100 కౌంట్ ధర కేజీ రూ.210 పలుకుతోంది.

లక్షల కుటుంబాల ఉపాధిపై పెను ప్రభావం

ఆక్వా రంగంపై ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఇవేగాక ప్రాసెసింగ్ యూనిట్లలోను, రొయ్యల పిల్లలు ఉత్పత్తి చేసే హేచరీస్‌లో పని చేసే అసంఘటిత కార్మికుల సంఖ్య కూడా లక్షల్లోనే ఉంది. ఎగుమతులు పడిపోతే ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. సాగు కుదించుకుపోయి దిగుబడి తగ్గిపోతుంది. దీంతో ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రభావం పడి ఉపాధి దెబ్బతింటుంది. వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.

ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టం

వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.270 ఉంటే ప్రస్తుతం రూ.210గా ఉంది. 60 కౌంట్ ధర రూ.305కు పడిపోయింది. ప్రతి కౌంట్‌కూ రూ.30 నుంచి రూ.100 వరకూ తగ్గింది. దీన్ని బట్టి చూస్తే సాగుదారులు ఎకరాకు రూ.40 వేల నుంచి కౌంట్‌ను బట్టి రూ.2 లక్షలు వరకూ నష్టపోతున్నారు.

ఆక్వా ఎగుమతులకు అమెరికా మార్కెట్‌కు బదులు ఇతర దేశాల్లోని కొత్త మార్కెట్లు అన్వేషించాలి. ఎగుమతి సబ్సిడీలు, పన్ను రాయితీలు, ప్రభావితమైన రంగాలకు తాత్కాలిక సహాయం అందించాలి. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ యూనిట్ రూ.1.50కే అందించాలి

రొయ్యల రైతులందరికీ సబ్సిడీతో ఎలాంటి అదనపు ఛార్జీలూ లేకుండా విద్యుత్‌ను యూనిట్ రూ.1.50కే అందించాలి. తగ్గిన సోయా ధరలకు అనుగుణంగా రొయ్యల ఫీడ్ ధరలను కనీసం కిలోకు రూ.15కు తగ్గించాలి. రొయ్యల సాగులో ఉపయోగించే కెమికల్స్, మినరల్స్ ధరలను కనీసం 30 శాతం తగ్గించాలి. కనీస మద్దతు ధరను వనామీ రొయ్యలు కిలో 100 కౌంట్‌కు రూ.270, 30 కౌంట్‌కు రూ.400కు తగ్గకుండా ఎగుమతిదారులతో నేరుగా కొనుగోలు చేయించాలి. ధరలు తగ్గిన పరిస్థితుల్లో తగ్గిన ధరను ప్రభుత్వం బోనస్ రూపంలో రైతులకు చెల్లించి ఆదుకోవాలి.

సబ్సిడీపై దాణా సరఫరా చేయాలి

కిలో దాణాకు రూ.4 తగ్గించాలని రైతులు డిమాండ్ చేయగా కూటమి సర్కార్ కేవలం రూ.2 తగ్గించి చేతులు దులుపుకుంది. దాణాపై మరింత సబ్సిడీ ఇవ్వాలని, లేదా ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరుతున్నారు. రొయ్యలకు వాడే మందులు, వాటర్ ప్రొబ్రాయిటిక్, మినరల్, ఆక్సిజన్ టాబ్లెట్స్ తదితర వాటి రేట్లు కూడా పెరుగుతున్నాయి. గత సంవత్సరం కిలో ఆక్సిజన్ టాబ్లెట్ రూ.350 ఉంటే ఇప్పుడు రూ.400 పెరిగింది.

విద్యుత్ బిల్లులు అధికం

ముదుండి మణిబాబు, ఆక్వా రైతు, కలవపూడి

రొయ్యల ఉత్పత్తిలో కరెంటు వాడకం కీలకంగా మారింది. ఏడెకరాలకు సంబంధించిన రైతుకు కరెంట్ బిల్లు రూ.40 వేలు వచ్చింది. ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేలు వరకు బిల్లు వచ్చింది. రాయితీ ఇచ్చినట్లు ఇచ్చి ట్రూఅప్ ఛార్జీల పేరుతో వెనక్కి గుంజుకుంటున్నారు. కాబట్టి ట్రూఅప్ ఛార్జీలు ఎత్తివేయాలి.

100 కౌంట్ రొయ్యలకు రూ.270 మద్దతు ధర ప్రకటించాలి

ఆకుల హరేరాం, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి, భీమవరం

అమెరికాకు 20, 30 కౌంట్ల రొయ్యలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. 60 కౌంట్ నుంచి 100 కౌంట్ వరకు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రొయ్యల కొనుగోలుదారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రస్తుతం 100 కౌంట్ రూ.210కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుకు కిలోకు రూ.50కుపైగా నష్టపోతున్నారు. ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని 100 కౌంట్ రొయ్యలు కిలో కనీస మద్దతు ధర రూ.270గా ప్రకటించి, అది అమలయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షించాలి. సన్న, చిన్నకారు రైతులందరికీ విద్యుత్ రాయితీ వర్తింపజేయాలి. హేచరీలపై ప్రభుత్వ అజమాయిషీ తప్పనిసరి. ప్రభుత్వ హాస్టళ్ళు, ఇతర సంస్థల్లో 15 రోజులకు ఒకసారి రొయ్యలను ఫుడ్ మెనూలో చేర్చాలి. తద్వారా స్థానికంగానే రొయ్య వినియోగం పెరిగి రైతులు నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ చెప్పారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరించారు. నడవలేని వారు, వికలాంగుల వద్దకు ఆయనే వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఫిర్యాదులను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వేగవరంలో 2కె రన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం పంచాయతీ పరిధిలో ఉన్న వేణు కార్డియాలజీ ఆసుపత్రి డాక్టర్ వేణు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలోని ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో 2 కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణు మాట్లాడుతూ మనిషి అవయవాల్లో గుండె చాలా ప్రాముఖ్యమైనదని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరికీ ఉందని తెలిపారు. అందరూ వాకింగ్ చేయాలని, కొవ్వు పదార్థాలు తక్కువగా తినాలని ప్రజలకు సూచించారు. 2 కె రన్ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వామ్ ఐటిఐ కాలేజీలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి స్వామ్ ఐటిఐ కాలేజీలో దసరా ఉత్సవాల సందర్భంగా కనకదుర్గమ్మవారి మూల నక్షత్రం సరస్వతి దేవి అలంకరణ సోమవారం నిర్వహించారు. ఆయుధ పూజచేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.హరిత, స్టాఫ్ ఒ.మణిభీమరాజు, బి.కృష్ణమోహన్, విఎన్.విజయదుర్గ, జిఎన్‌వి.శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కుటుంబంలోని మహిళలు పూర్తిస్థాయిలో శారీరక, మానసిక ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజంలో బలమైన కుటుంబాలు రూపుదిద్దుకుంటాయని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక సామాజిక ఆసుపత్రి ఆవరణలో సోమవారం స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 104 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఏడుగురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ కరాటం శిరీష, సభ్యులు కరాటం శ్రీకాంత్, కరిమికొండ శివాజీ, ముదునూరి రవివర్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసుంధర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడిక తీత

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా ముందుండి ఆ సమస్యను పరిష్కరించడానికి తమ వంతు సహాయం చేస్తానని టిడిపి రమణక్కపేట గ్రామ అధ్యక్షులు రంగు వాసు చెప్పారు. మండలంలోని రమణక్కపేట గ్రామం పరిధిలోని హరిజనవాడలో గత కొంతకాలం నుంచి డ్రెయినేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. తమ సొంత ఖర్చులతో పొక్లెయిన్ ద్వారా డ్రెయినేజీలో పూడిక తీయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సలోనికి బంగారు పతకం

ప్రజాశక్తి - చింతలపూడి

38వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో మండలంలోని ఎర్రంపల్లి గ్రామానికి చెందిన బోడ సలోని బంగారు పతకం సాధించింది. ఆమె తండ్రి బోడ సురేష్ గతంలో కబడ్డీ నేషనల్ ప్లేయర్. క్రీడల పట్ల ఆసక్తి ఉండడంతో తమ కూతురిని క్రీడల పట్ల ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

దాతల సేవలు అభినందనీయం

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

దాతలు సేవలు అభినందనీయమని, చేయూతను ఇచ్చి ఆదుకున్న వారిని నిరుపేద కుటుంబాలు జీవితాంతం గుర్తుంచుకుంటాయని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మండలంలోని బర్రిబంధం గ్రామంలో సోమవారం వైఎస్ఆర్ ఛారిటీస్ ద్వారా పది కుట్టుమిషన్లు, ఒక టిఫిన్ తోపుడు బండిని, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిరుపేదలకు ఉపకరణాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మనకు ఉన్న దాంట్లో కొంత నిరుపేదలకు అందించిన సంతృప్తి దేనిలోనూ రాదన్నారు. వైఎస్ఆర్ ఛారిటీస్ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని, నిరుపేదలకు ఉపకరణాలు అందించడం వల్ల వారు ఆర్థికంగా బలోపేతమై గ్రామంలో గౌరవంగా జీవిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ ఛారిటీస్ యలమంచిలి జయప్రకాష్, వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా గ్రామాలాభివృద్ధి

పట్టణాలకు దీటుగా గ్రామాలాభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గ్రామ ప్రజలు, కూటమి నాయకులతో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయని, ప్రజా ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన విజయవంతంగా సాగుతుందన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు


మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ముక్తకంఠంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైసిపి కౌన్సిలర్ నౌడు నాగమల్లేశ్వరరావు మరికొందరు కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్య, పారిశుధ్యం, కోతులు, కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొత్తగా మోటారు కొనుగోలు చేయడం, సక్రమ నీటి సరఫరా కోసం ఇంజినీరింగ్ అధికారులు ముందుగా చొరవ చూపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమ నీటి సరఫరా కోసం ముందుస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కొందరు పారిశుధ్య సిబ్బంది సెలవుపై వెళ్తే వారి స్థానంలో మరికొందరిని తాత్కాలిక పద్ధతిలో తీసుకొని పట్టణంలో పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో కోతులు, కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్న సంఘటనలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సరైన సమయంలో సరైన రీతిలో అధికారులు స్పందించాలని కోరారు. అనంతరం ఎజెండాలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించి, కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్, లాం ప్రసాదరావు, మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మండవల్లి : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ యువతకు పిలుపునిచ్చారు. మండలంలోని లింగాలలో సేవ పక్షోత్సవాల్లో భాగంగా కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆశీస్సులతో గ్రామస్తుడు బోయిడి సురేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తం ఎంతో విలువైనదని ఆపద సమయంలో విలువ కట్టలేనిదన్నారు. ప్రసవం సమయంలో, ఆపరేషన్ల సమయాల్లో రక్తం సరిపోక పేషెంట్లు ఎంతో ఇబ్బంది పడతారన్నారు. అంతేకాకుండా ప్రమాదాలు జరిగి అధిక రక్తస్రవమై ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రక్తం ప్రాణాలను నిలబెడుతుందని తెలిపారు. నేటి యువత రక్తం విలువను తెలుసుకొని రక్త దాతలు కావాలని కోరారు. రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్త దాన శిబిరంలో పాల్గొని రక్తం ఇచ్చిన 20 మందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సమయం ఏసుబాబు, గుడివాడ గణేష్, మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు పవిత్ర, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గత పరిపాలనలో నిధుల అవకతవకలు

కొర్లగుంట సొసైటీ చైర్మన్ పొట్లూరి అనురాధ

ప్రజాశక్తి - ముసునూరు

గత పరిపాలన కాలంలోని సొసైటీ అధ్యక్షుల నిర్లక్ష్యం వల్లే సొసైటీ పరిధిలోని నగదు కొంతమేర దుర్వినియోగమైందని కొర్లగుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ రైతులు తీర్మానించారు. మండలంలోని కొర్లగుంట సొసైటీలో ఛైర్మన్ పొట్లూరి అనురాధ అధ్యక్షతన, కార్యదర్శి పార్వతి ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సొసైటీ భవన నిర్మాణానికి తీర్మానం, అలాగే గత వైసిపి పరిపాలన కాలంలో త్రి సభ్య కమిటీ సమయంలో గోడౌన్ నిర్మించాలని కోరుతూ రూ.40 లక్షల సెంట్రల్ బ్యాంక్ వారి వద్ద నుంచి నిధులు మంజూరు చేసుకుని సొసైటీకి దూరంగా 33 సెంట్ల స్థలంలో గోడౌన్ నిర్మించడానికి లీజు తీసుకుని, రూ.15 లక్షలతో నిధులు మంజూరు చేయగా ఆ స్థలంలో ఇప్పటి వరకు 25 శాతం పనులు చెప్పటి, మిగతా పనులు పూర్తి చేయకపోవడంతో పాటు, తీసుకున్న రూ.15 లక్షలకు వడ్డీ రూపంలో రూ.నాలుగు లక్షలు కట్టాల్సి వస్తుందని, రైతులు, సొసైటీ సొమ్ము దుర్వినియోగం కాకుడదనే ఉద్దేశంతో ఆ రూ.40 లక్షలతో గోడౌన్ నిర్మంచడం లేదని కోరుతూ తీర్మానం చేసి రైతులు సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. 1991-1995 లో కొర్లగుంట సొసైటీ తీసివేసి చింతలవల్లి సొసైటీలో విలీనం చేయాలని చూస్తే అప్పుడు రైతులందరూ కలిసి సొసైటీకి కొంతమేర రైతుల సభ్యత్వాలు చేర్చి నేడు ఉన్నత స్థానంలో ఉన్న సొసైటీ మళ్లీ ఆర్థిక లోతుల్లోకి వెళ్లకూడదని, గోడౌన్ నిర్మించే స్థలం కుడా గ్రామానికి, సొసైటీకి దూరంగా ఉండటం వల్ల తీర్మానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా 14.35.14, డిఎపి 20.13.20 రసాయనిక ఎరువులు రైతులకు ఆందుబాటులో ఉంచాలని కోరారు. సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు ఎన్.సూర్యనారాయణ, ఆలుగుల సుమలత, టిడిపి నాయకులు పొట్లూరి పంఢరినాధ్, భాస్కరరావు, రైతులు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనురాధ

చట్టాలపై అవగాహనుండాలి

ఉంగుటూరు : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ వై.పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. నారాయణపురం ఎస్‌సి కాలనీలో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు చట్టం పరిధితో లీగల్ ఒపీనియన్ ఫీజు లేకుండా కోర్టు వారు పేదలకు ఉచితంగా కేసులు వాదించటానికి ప్రభుత్వం వారు తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ సాంబశివరావు, దళిత సేన పోరాట సమితి అధ్యక్షుడు, గ్రామ పంచాయతీ తొమ్మిదో వార్డు సభ్యుడు నేకూరి ఆశీర్వాదం, మాజీ ఎంపిటిసి తాడిగడప సుబ్బారావు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

నెలపర్తి సుమన్, తండ్రి: సుందరరావు, డోర్ నెంబర్: 2-45, ఆగర్తిపాలెం-ఆగర్రు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది. 19-02-2013 లో వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి **K9444075** నెంబర్ పాస్‌పోర్ట్ పొందియున్నాను. నేను ది 20-09-2025 న ఆగర్తిపాలెం లో మా ఇంటి నుంచి పాలకొల్లు మెయిన్‌రోడ్ లో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను జెరాక్స్ తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెం: 95027 66960

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పవర్‌పేట, చదలవాడ వారి వీధి, డోర్ నెం: 22B-8-20 కి చెందిన మండవ భాగ్యలక్ష్మి, W/o. మండవ పూర్ణచంద్రరావు (లేటు) అను నాయొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. **దస్తావేజులు నెం: 98/1982 Dt. 07-01-1982** రిజిష్టర్డ్ ఏలూరు **SRO** మరియు **2749/1960** రిజిష్టర్డ్ **09-06-1960** ఏలూరు **SRO R.S. No: 55,56** ఎక్స్‌టెంట్ **of AC 1-82** సెంట్లు, ఏలూరులో గల సత్రంపాడు ప్రోపర్టీ మా భర్త మండవ పూర్ణచంద్రరావు గారిది. ది. 17-09-2025 తేదీన నా యొక్క ఒరిజినల్ దస్తావేజులను తీసుకొని, ఫైర్ ఆఫీస్ వద్ద జిరాక్స్ సెంటర్‌కు, జిరాక్స్ తీయించు నిమిత్తం వెళ్ళుచుండగా దారి మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మండవ భాగ్యలక్ష్మి
W/o. పూర్ణచంద్రరావు
డోర్ నెం. 22B-8-20,
చదలవాడవారి వీధి,
పవర్‌పేట, ఏలూరు జిల్లా
సెల్ నెం: 95024 22258

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) BHIMAVARAM

Succession O.S.No.2/2025

Between:

Petitioner:
Kayala Venkata Satyanarayana

Vs

Respondent:
The Branch Manager, Union Bank of India. Kalla Branch.

పై నెంబరు లో ది. 05-06-2021 సం॥ తేదీన చనిపోయిన Velivela Ramalakshmi తాలూకు Union Bank of India Kalla Branch లో Dopesite గా వున్న 4,26,113-62 Ps లకు పిటీషన్‌ను తీసుకొనుటకు Legal Representation అధి Succession Certificate ఇప్పించమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున సదరు పిటీషను పై ఎవరికైన ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల **ది. 22-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్ష మందు తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

సంధి మాణిక్యాలరావు M.A., B.L.,
భీమవరం అడ్వకేట్, భీమవరం
ది.29-09-2025 సెల్: 98661 54492